
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 351 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 06, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఈనెల 10 నుంచి 12వ తేదీలలో వ్యవసాయ డిప్లొమా కోర్సుల కౌన్సిలింగ్



హైదరాబాద్ (రాజేంద్రనగర్),జూన్5(నమస్తే ఉదయం):

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్‌లు, విశ్వ విద్యాలయంచే గుర్తింపు పొందిన ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో రెండు సంవత్సరముల వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ డిప్లొమా కోర్సులు, మూడు సంవత్స రముల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు ఈనెల 10వ తేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ ఆర్ రఘురాంరెడ్డి తెలిపారు. ఈ కౌన్సిలింగ్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలీసెట్- 2024 ర్యాంకులు మిగతా.. 2లో

టూరిజం స్టడీ టూరులో ...మీడియాకు నో ఎంట్రీ ఇతరులకు ఒకే

ఎన్‌టిసిఏ గైడ్‌లైన్స్ షరతులు కొందరికేనా ?

అటవీ శాఖ అధికారుల తీరుపై సర్వత్రా చర్చ





అటవీ ప్రాంతాన్ని తిలకిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

# నల్లమల్లలో మంత్రులు, ఎమ్మెల్యేల బృందం

అచ్చంపేట, జూలై 5(నమస్తే ఉదయం):

నల్లమల ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మీర్చేందుకు అవసరమైన ప్రాంతాలను పరిశీలించి నివేదిక తయారు చేసేందుకు గాను ఇద్దరు మంత్రులు, ఉమ్మడి మహబూబ్ నగర్ కు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండలంలోని పర్యాటక ప్రదేశాల సందర్శనకు శుక్రవారం వెళ్లారు. కాగా ఫారెస్ట్ శాఖ, టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మీడియాకు మాత్రం అనుమతి లేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఇతరులకు మాత్రం అనుమతి ఉంటుందా ? మీడియాకు మాత్రం ఎందుకు ఉండదు ? ఇలా చేదు అనుభవం ఎదురయింది.

### ఎన్‌టిసిఏ రూల్స్ ప్రకారం..

వైల్డ్ యానిమల్స్ మేట్ టైమ్ కావడంతో నేషనల్ టైగర్ రిజర్వేషన్ ఆఫ్ అథారిటీ వారి ఆదేశానుసారం జులై 1 నుండి సెప్టెంబర్ 31 వరకు ఫారెస్ట్‌లోకి నో ఎంట్రీ విధించారు. ఈ క్రమంలో అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన ప్రాముఖ్యత సంతరించు కున్నప్పటికి అభివృద్ధిలో భాగంగా పర్యటన కాబట్టి ఇబ్బంది లేదు. కానీ మీడియాకు అనుమతులు లేకున్నా ఫారెస్ట్ అధికారులు లాంచనాలతో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రం మంత్రులూ, అధికారులకు ధీటుగా సఫారీ వాహనం కేటాయించి అడవిలోకి పంపడంపై స్థానికంగా దుమారం రేపుతోంది. కాగా పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు కు సఫారీ వెహికిల్ లేక కొంత సేపు ఇబ్బంది పడడం గమనార్హం. ఈ యాత్ర నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు వారు వ్యవహరించిన తీరుతో.. చట్టానికి కొందరు మాత్రమే చుట్టాలు మరికొందరు కాదు అన్నట్లుగా ఉందని చర్చనీయాంశంగా మారింది. మీడియాకు ఎంట్రీ లేకపోవడంతో అటవీ శాఖ అధికారుల పట్ల మీడియా అసంతృప్తి వ్యక్తం చేసింది.





- ఆధునిక వసతులతో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం
- స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రక్షాళన
- పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### సామాన్యుడిపై భారం పడకుండా

## భూముల ధరల సవరణ

హైదరాబాద్,(నమస్తే ఉదయం):

మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారు లను ఆదేశించారు. స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్స్ శాఖపై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సుధీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్స్ ఐ.జి. జ్యోతి బుద్ధ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఉన్న భూముల ధరలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో దానికి అనుగుణంగా భూముల ధరలను సవరించాలని నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి వెల్లండించారు. బహిరంగ మార్కెట్ విలువలకు, మార్కెట్ ధరలకు భారీగా వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలని సూచించారు. ఏఏ ప్రాంతాలలో ఎక్కువ వ్యత్యాసం ఉంది, అక్కడ హేతుబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవ కాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే, ప్రభుత్వ ధర అధికంగా ఉందని అక్కడ తగ్గించాలి. గత ప్రభుత్వంలో ఎలాంటి కసరత్తు చేయకుండానే భూముల ధరలను పెంచారని ఇప్పుడు అటువంటి పరిస్థితి పునరావృతం కాకూడదు.

స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్స్ శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని మిగతా.. 2లో

### బడ్జెట్ సమావేశాల్లో చర్చించి..

# నిరుద్యోగులకు మేలు చేస్తాం..



### సభలో చర్చించి జాబ్ క్యాలెండర్ విడుదల

- స్వార్థపూరిత శక్తులకు బలికావద్దు
- ఎవరికీ నష్టం లేకుండా చూద్దాం
- కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా కసరత్తు
- నిరుద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ

హైదరాబాద్,(నమస్తే ఉదయం):

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, తప్పకుండా నిరుద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావద్దని నిరుద్యోగులకు సూచించారు.

పరీక్షలు జరుగుతున్న సమయంలో ఇష్టమొచ్చినట్లు నిబంధనలు మార్చితే తలెత్తే చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసినట్లుతప్పుడు నిర్ణయాలు తీసుకుంటే మిగతా.. 2లో

## తగిన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట

- హాత్రాస్ బాధితులకు రాహుల్ పరామర్శ



లక్నో,జూలై5(నమస్తే ఉదయం):

లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ శుక్రవారం హత్రాస్‌ను సందర్శించి, తొక్కిసలాట మృతుల కుటుంబాలను పరామర్శించారు. మతపరమైన కార్యక్రమానికి తగిన పోలీసు ఏర్పాట్లు చేయలేదని, ఇదే తొక్కిసలాటకు దారితీసిందని మృతుల బంధువులు చెప్పారని ఆయన తెలిపారు. ఈ విషాదాన్ని రాజకీయం చేయదలచుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు. కాగా మృతుల కుటుంబాలకు మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది బాధాకరమైన సంఘటన. చాలా మంది మరణించారు. మిగతా.. 2లో

# త్వరలో కొత్త విద్యుత్ పాలసీ..

- మాది పారిశ్రామిక ఫ్రెండ్లీ గవర్నమెంట్
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో ఫార్మా క్లస్టర్లు
- 24 గంటలు మా క్యాబినెట్ అందుబాటులో ఉంటుంది
- దేశంలో 35 శాతం ఫార్మా ఉత్పత్తులు తెలంగాణ నుంచే ఇది మన రాష్ట్రానికి గర్వకారణం
- ప్రతి ఏటా 50వేల కోట్ల విలువైన మందులు ఎగుమతి చేస్తున్నాం
- రాష్ట్రంలో ఏ పరిశ్రమకు ఎలాంటి సమస్య రానివ్వం
- పరిశ్రమలకు విద్యుత్తు, నీటి సమస్య లేదు
- గ్రీన్ ఎనర్జీ, మిగులు విద్యుత్ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం
- ఆరోగ్య సంరక్షణకు ఫార్మా పరిశ్రమ వెన్నుముక లాంటిది
- రోగుల భద్రత, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో ఫార్మ రంగానిది కీలకపాత్ర
- అత్యధిక నాణ్యతతో జనరిక్ మెడిసిన్ ఉత్పత్తి చేసి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తూ తెలంగాణ గుర్తింపు
- 73వ ఫార్మా కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,(నమస్తే ఉదయం):

విదేశాలకు ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తుల్లో 35 శాతం ఎగుమతులు తెలంగాణ రాష్ట్రం నుంచే అవుతున్నాయంటే ఈ అంశం మన అందరికీ గర్వకారణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు అన్నారు. శుక్రవారం హైటెక్స్ లో జరిగిన 73వ ఫార్మా కాంగ్రెస్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

ఫార్మసిస్టులు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు మిగతా.. 2లో




## కూలుతున్న వంతెనలు


- 16మంది ఇంజనీర్లను సస్పెండ్ చేసిన బీహార్ ప్రభుత్వం

లక్నో,జూలై5(నమస్తే ఉదయం):

బీహార్‌లో గడచిన 15 రోజుల్లో పది వంతెనలు కూలిపోయిన పర్యవసానంగా రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజనీర్లు 16 మందిని సస్పెండ్ చేసినట్లు ఆ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. బీహార్ అభివృద్ధి విభాగం కార్యదర్శి చైతన్య ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ, దీనిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర విషయంగా



పరిగణిస్తున్నదని చెప్పారు. వంతెనల నిర్మాణానికి బాధ్యులైన కాంట్రాక్టర్ల జాడ తీస్తామని, వారిపై చర్య తీసుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని శరణ్ జిల్లాలో గురువారం పదవ వంతెన కూలిపోయింది. గడచిన 24 గంటల్లో శరణ్ జిల్లాలో కూలిన మూడవ వంతెన అది. కూలిపోయిన పది వంతెనలు శివన్, శరణ్, మధుబని, అరారియా, తూర్పు చంపారణ్, కిషన్‌గంజ్ జిల్లాలో ఉన్నాయి. 'అన్ని పాత వంతెనలపై సర్వే చేయాలని, తక్షణ మరమ్మతులు అవసరమైన వాటిని మిగతా.. 2లో




## మరోసారి నిరాశ

- ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసు
- జుడీషియల్ కస్టడీని జులై 18 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ,జూలై5(నమస్తే ఉదయం):

ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. ఆమె జుడీషియల్ కస్టడీని జులై 18 వరకు రౌస్ అవెన్యూ కోర్ట్ పొడగించింది. నేటితో కవిత జ్యూడిషల్ కస్టడీ ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను రౌస్ అవెన్యూ కోర్టు ముందు అధికారులు హాజరు పరిచారు. కాగా ఏప్రిల్ 11న ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె తీహార్ జైలులో ఉన్నారు. కాగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవి ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తీహార్ జైలులో ప్రశ్నించిన అనంతరం సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కవిత అరెస్ట్‌ను అధికారికంగా సీబీఐ ప్రకటించి, కోర్టుకు కూడా సమాచారం ఇచ్చింది. దీంతో ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే కవిత మరోసారి అరెస్టయినట్టయింది. అటు ఈడీ.. ఇటు సీబీఐ అరెస్ట్ నేపథ్యంలో కవిత చాలా కాలంగా జైలులోనే ఉన్నారు. బెయిల్ కోసం ఆమె చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ మిగతా.. 2లో

## నగరంలో ఇక బోనాల సందడి

### ఆదివారం గోల్కొండ బోనాలతో షురూ



హైదరాబాద్,జూలై 5(నమస్తే ఉదయం):

ఆషాడ మాసం వచ్చిందంటే చాలు భాగ్యనగరంలో బోనాల సందడి మొదలవుతుంది. అమ్మ బైలెల్లినాదే అంటూ అమ్మవారికి భక్తులు చీర, సారెలు, నైవేద్యాలతో బోనాలు సమర్పిస్తుంటారు. ప్రతీ ఏడాది లాగే ఈ సారి కూడా హైదరాబాద్‌లో బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో బోనాల జాతర షురూ అవుతుంది. ఈనెల 7వ తేదీ ఆదివారం నుంచి గోల్కొండ ఖిల్లా నుంచి జాతర ప్రారంభం కానుంది. ఇప్పటికే బోనాల పండుగ మిగతా.. 2లో

# బడ్జెట్ సమావేశాల్లో చర్చించి.. నిరుద్యోగులకు మేలు చేస్తాం..

మొదటిపేజీ తరువాయి..

నిరుద్యోగులకు న్యాయం జరగకపోగా..ఇప్పుడున్న నోటిఫికేషన్లు కూడా రద్దయ్యే ప్రమాద ముందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం తమ ప్రభుత్వం ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఏళ్లకు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కులన్నింటిని అధిగమించిందని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోలో చర్చించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలు, వివిధ బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు ఏర్పడకుండా నిరుద్యోగు లకు పూర్తి న్యాయం జరిగేలా క్యాలెండర్ రూపొందిస్తా మన్నారు. ఇంత కీలకంగా తమ ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో కసరత్తు చేస్తుంటే కొందరు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడు తున్నారని మండిపడ్డారు. కొందరు చేసే కుట్రలతో నోటిఫికే షన్లలోని నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే, ఉద్యోగాలు భర్తీ చేసే ప్రక్రియ నిలిచిపోయి, నిరుద్యోగులు మరింత నష్టపోతారని సీఎం స్పష్టం చేశారు.

నిరుద్యోగుల ఆందోళనల దృష్ట్యా ముఖ్యమంత్రి తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి, పవన్ మల్లాది, ప్రొఫెసర్ రియాజ్, టీచర్ల జేఏసీ హర్షవర్ధన్‌రెడ్డి, ఓయూ విద్యార్థి నాయకులు చనగాని దయాకర్, మానవతా రాయ్, బాల లక్ష్మి, చారకొండ వెంకటేష్, కాల్వ సుజాత తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో నిరుద్యోగులకు సంబంధించిన డిమాండ్లు, జరుగుతున్న ఆందోళనలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సంబంధిత అధికారులను పిలిపించి మాట్లాడారు. నిరుద్యోగులు లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. గ్రూప్ 1 పరీక్షకు ఒక్కో పోస్టుకు 1: 50 నిష్పత్తి చొప్పున కాకుండా 1: 100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలనే డిమాండ్ పై, ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చ జరిగింది. గత ప్రభుత్వం 2022లో వేసిన గ్రూప్ 1 పరీక్ష పేపర్ల లీకేజీ, తప్పుడు నిర్ణయాల కారణంగా రెండు సార్లు వాయిదా పడిం దని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులో ఉన్న ఈ పిటిషన్ వెనక్కి తీసుకుందని అధికారులు సీఎంకు వివరించారు.

పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి అదనంగా మరిన్ని పోస్టులతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. పన్నెండేండ్ల తర్వాత చేపట్టిన గ్రూప్ 1 పరీక్షకు నాలుగు లక్షల మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.. ఇటీవలే ప్రిలిమినరీ పరీక్షను టీజీపీఎస్సీ పకడ్బందీగా నిర్వహించిందని చెప్పారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్ లో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున మెయిన్స్‌కు ఎంపిక జరుగు తుందని వివరించారు.

ఇప్పుడు 100 మందిని ఎంపిక చేసేలా నిబంధనలను సవరిస్తే కోర్టులు జోక్యం చేసుకునే ప్రమాదముందని, అదే జరిగితే మొత్తం నోటిఫికేషన్ మళ్లీ నిలిచిపోతుందని అధికా రులు వివరించారు. నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలను మార్చితే న్యాయపరంగా చెల్లుబాటు కాదని సీఎంకు వివరించారు. గ్రూప్ 1 పరీక్ష రెండోసారి రద్దయినప్పుడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి నోటిఫికేషన్‌లో ఉన్న బయో మెట్రిక్ పద్ధతిని ఎందుకు పాటించ లేదనే ఏకైక కారణంతో రాష్ట్ర హైకోర్టు పరీక్షను రద్దు చేసిందని గుర్తు చేశారు.

1999లో యూపీఎస్సీ వర్సెస్ గౌరవ్ ద్వివేది కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదాహరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న దానికంటే ఎక్కువ మందికి అవకాశమిస్తే.. ముందుగా ఉన్నవాళ్లకు అన్యాయం జరిగినట్లే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల పెంపు మీద కూడా చర్చ జరిగింది. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పోస్టులు పెంచటం కూడా నోటిఫికేషన్ ను ఉల్లంఘించినట్లే అవుతుందని, అప్పుడు కూడా కోర్టులు జోక్యం చేసుకునే పరిస్థితి ఉంటుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# త్వరలో కొత్త విద్యుత్ పాలసీ..

మొదటిపేజీ తరువాయి..

వెన్నుముక లాంటి వారు అని తెలిపారు. రోగి భద్రత, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో ఫార్మా రంగానికి కీలకపాత్ర అన్నారు. అత్యధిక నాణ్యతతో తక్కువ ధరకు జనరిక్ మెడిసిన్ను ఉత్పత్తి చేసి ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి చేస్తూ తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని తెలిపారు. కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో అసమానమైన చురుకుదనం ప్రదర్శించి, అవిశ్రాంతంగా శ్రమించారని ఫార్మసిస్టుల సేవలను ఆయన కొనియాడారు.

ఫార్మా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుంది అన్నారు. హైదరాబాద్ బిర్యానీకి ప్రసిద్ధి ఇప్పుడు బిర్యానీతోపాటు బయో ఫార్మా ఉత్పత్తులకు ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. అందరికీ ఆరోగ్యం అందుబాటులో తీసుకొస్తే దృఢమైన ప్రపంచాన్ని నిర్మించగలమన్నారు. బౌల్ అఫ్ ఫార్మగా హైదరా బాద్ స్థిరపడిందన్నారు. సుగంధ ద్రవ్యాలను సరఫరా చేసే స్థాయి నుంచి మానవ జీవితాలను కాపాడే మందుల సరఫరా దశకు తెలంగాణ రాష్ట్రం చేరుకుందన్నారు. ఫార్మా రంగంలో అనేక ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా మారింది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగంతో స్నేహపూర్వక వైఖరిని అవలంబిస్తుం దన్నారు. రాష్ట్రంలో ఏ పరిశ్రమకు ఎలాంటి సమస్య రాకుండా చూసుకునే బాధ్యత తమది అన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల మధ్య ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు.

రాష్ట్రంలో పరిశ్రమలకు విద్యుత్తు, నీటి కొరత ఉండదన్నారు. త్వరలో రాష్ట్రంలో కొత్త విద్యుత్ పాలసీని ఆచరణలో తీసుకురా అన్నట్టు వివరించారు. గ్రీన్ ఎనర్జీ, మిగులు విద్యుత్తు ఉండేలా కొత్తచట్టంలో చర్యలు చేపట్టినట్టు వివరించారు. ఆరోగ్య సంర క్షణకు ఫార్మా పరిశ్రమ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలు మీకు అందుబాటులో ఉంటుంది అని భరోసా ఇచ్చారు. ఫార్మాసిస్టులు మాంత్రికుల లాంటివారు, వారు చిన్న చిన్న మాత్రలను ఆరోగ్యానికి శక్తివంత మైన ఏజెంట్లుగా వినియోగిస్తారని చమత్కరించారు.

### సామాన్యుడిపై భారం పడకుండా

# భూముల ధరల సవరణ

మొదటిపేజీ తరువాయి..

అధికారులను ఆదేశించారు. చట్టంలో ఉన్న లొసుగులకు ముగింపు పలికేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు గంటల తరబడి చెట్ల కింద వేచి చూసే పరిస్థితి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అత్యా ధునిక వసతులతో శాశ్వతంగా సబ్–రిజిస్ట్రార్ కార్యాల యాలను నిర్మిస్తామని తెలిపారు.

ఇందుకోసం అవసరమైన భూములను గుర్తించాలని అధి కారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్లకు టైమ్ స్లాట్ అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పని భారం అధికంగా ఉన్న సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రత్యామ్నాయం చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలను చేపడుతామని హామీ ఇచ్చారు.

# కూలుతున్న వంతెనలు

మొదటిపేజీ తరువాయి..

గుర్తించాలని బుధవారం సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి (నితీశ్ కుమార్) అధికారులను ఆదేశించారు' అని ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి విలేకరులకు తెలియజేశారు. వంతెనలు కూలిపోవడంపై దర్యాప్తు సాగుతోందని ఆయన చెప్పారు. కాగా, జూన్ 18 నుంచి బీహార్‌లో 12 వంతెనలు కూలిపోయాయని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. 'జూన్ 18 నుంచి బీహార్‌లో 12 వంతెనలు కూలిపోయాయి. బీహార్‌లో ఈ సంఘటనలపై ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇద్దరూ మౌనం వహించారు. సత్పరిపాలన, అవినీతి రహిత ప్రభుత్వం ప్రకటనలకు ఏమైంది?' అని తేజస్వి 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వంలో ప్రతి శాఖలో అవినీతి ఎంతగా ప్రబలిపోయిందో ఈ సంఘటనలు సూచిస్తున్నాయి' అని తేజస్వి ఆరోపించారు. బీహార్ రోడ్డు నిర్మాణ శాఖ ఒక వంతెన నిర్వహణ విధానాన్ని సిద్ధం చేసి, సాధ్యమైనంత త్వరగా తన ప్లాన్‌ను రూపొందించవలసిందిగా గ్రామీణ పనుల శాఖను కోరింది. తేజస్వి యాదవ్ 15 నెలలకు పైగా గ్రామీణ పనుల శాఖను నిర్వహించినప్పుడుఈ పరిస్థితిని సరిదిద్దేందుకు ఏమీ చేయలేదని రాష్ట్ర గ్రామీణ పనుల శాఖ మంత్రి అశోక్ చౌదరి విమర్శించారు. 'పూర్వపు మహాఘట్‌బంధన్ ప్రభుత్వ హయాంలో 15 నెలలకు పైగా తాను ఈ మంత్రిత్వశాఖను నిర్వహించిన విషయాన్ని ఆర్‌జెడి నేత (తేజస్వి యాదవ్) గుర్తుంచుకోవాలి. అప్పుడు ఆయన ఏమి చేశారు? ఈ సంక్షోభానికి పూర్వపు ఆర్‌జెడి సారథ్య బీహార్ ప్రభుత్వాన్ని, ఆయనను బాధ్యులను చేయాలి' అని అశోక్ చౌదరి అన్నారు.

# మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు చేయూత

**లక్ష చొప్పున అందచేయనున్న ప్రెస్ అకాడమీ**

హైదరాబాద్,జూలై5(నమస్తే ఉదయం): తెలంగాణలో ఆరునెలల కాలంలో మరణించిన 34 మంది జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జరిగిన ప్రెస్ అకాడమీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి అందజేయనున్నామని వివరించారు. చనిపోయిన జర్నలిస్టుల భార్యలకు నెలకు రూ. 3వేలు పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని అన్నారు. పెన్షన్ తో పాటు వారి పిల్లలకు ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు చదువుల కోసం నెలకు రూ. వెయ్యి అందజేస్తామన్నారు. ప్రాణాంతకర వ్యాధులతో బాధపడుతూ ప్రమాదానికి గురైన జర్నలిస్టులకు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. క్యాన్సర్ తో బాధపడుతున్న జర్నలిస్ట్ గురు ప్రసాద్, ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న బండి నారాయణకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు మంజూరు చేస్తూ కమిటీ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

వీరితోపాటు మరో ఇద్దరూ జర్నలిస్టులకు రూ. 50 వేలు మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమీ సెక్రెటరీ నాగులపల్లి వెంకటేశ్వరరావు, మేనేజర్ పిసి వెంకటేశం, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

# నగరంలో ఇక బోనాల సందడి

మొదటిపేజీ తరువాయి..

కోసం పెద్ద ఎత్తున సర్కార్ ఏర్పాట్లు చేసింది. గోల్కొండ నుండే రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగ మొదలవుతుంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రేపు ఒక్కరోజే సమయం ఉండడంతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు? పూర్తి అయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సమీక్షతో భారీ ఏర్పాట్లు జరిగాయి. గోల్కొండ తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ మహాకాళి బోనాలను నిర్వహించడం జరుగుతుంది. ఆషాఢ మాసం చివరి రోజున తిరిగి గోల్కొండ కోటలో చివరి బోనంతో పూజలు చేసి ఉత్సవాలను ముగింపు పలుకుతారు.

# చింతల గోవర్ధన్ రెడ్డికి సిఎం నివాళి

హైదరాబాద్,జూలై5(నమస్తే ఉదయం): కొడంగల్ నియోజకవర్గం పోతిరెడ్డిపల్లిలో కోస్గి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల గోవర్ధన్ రెడ్డి



మృతి చెందారు. విసయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడికి చేరుకున్నారు. చింత భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. గోవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిచారు. తనకు అత్యంత ఆప్ఉడు చింతల మృతి తీవ్రంగా కలసివేసిందని సిఎం అన్నారు.

### హాథ్రస్ ఘటనకు

# నిర్వాహకులదే తప్పే

**ప్రత్యేక దర్యాప్తు బృందం**

లక్నో జూలై5(నమస్తే ఉదయం): ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాథ్రస్‌లో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటన 121 మందిని బలిగొంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం తన విచారణను వేగవంతం చేసింది. ఇప్పటి వరకు 90 మంది వాంగ్మూలాలను నమోదు చేసినట్లు సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఏడీజీ అనుపమ్ కురుక్షేత్ర తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులదే తప్పిదమని ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు సూచిస్తున్నాయని పీటీఐ వార్తాసంస్థకు వెల్లడించారు. తొక్కిసలాట ఘటనపై రూపొందించిన ప్రాథమిక నివేదికను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఇప్పటికే సమర్పించాం. హాథ్రస్ డీఎం ఆశీష్ కుమార్, ఎస్పీ నిపుణ్ అగర్వాల్, ఇతర అధికారుల స్టేట్‌మెంట్‌లను ఇందులో పొందుపర్చాం. కేసులో పూర్తిస్థాయి దర్యాప్తును ముమ్మరం చేశాం. ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యాధారాలు.. నిర్వాహకుల అపరాధాన్ని సూచిస్తున్నాయని ఏడీజీ తెలిపారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. భోలే బాబా ఆచూకీ లభించాల్సి ఉంది. కేసులో ఆయన్ని నిందితుడిగా చేర్చలేదని అలీగఢ్ ఐజీ శాలభ్ మాథుర్ గురువారం తెలిపారు. ఎఫ్‌ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. హాథ్రస్ జిల్లా సికంద్రరావ్ ప్రాంతం ఫుల్‌రయీ, ముగల్‌గఢీ గ్రామాల మధ్యలోని రహదారిని అనుకొని ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక షెడ్లు వేసి సత్సంగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 80 వేల మంది భక్తులు హాజరవు తారని నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకు న్నారు. అయితే 2.5 లక్షలకు పైగా ప్రజలు వచ్చినట్లు తేలింది. జనం కిక్కిరిసి ఊపిరాడని కారణంగానే మర ణాలు సంభవించాయని శవపరీక్షల్లో తేలిందని ఎటాలోని జిల్లా ఆసుపత్రి వైద్యులు ఇప్పటికే వెల్లడించారు.

# చర్చలకు నేడు ముహూర్తం

**ప్రజాభవన్ వేదికగా ఇరు రాష్ట్రాల సిఎంల భేటీ**

**నివేదికలు సిద్ధం చేసిన అధికారులు**

**సాయంత్రం భేటీలో పాల్గొననున్న అధికారులు**

హైదరాబాద్,జూలై5(నమస్తే ఉదయం): తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న శుభముహూర్తం వచ్చింది. తెలుగు రాష్ట్రాల విభజన జరిగి పదేళ్లు... అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు నేడు అంటే శనివారం చర్చకు కూర్చోనున్నారు. ఈ తరుణం కోసం అంత ఎదురు చూస్తుండగా ప్రజాభవన్‌లో ఏర్పాట్లు చేశారు. సమస్యలను పరిష్కరించుకునే దిశగా ఇద్దరు ముఖ్యమంత్రులు చర్యలు చేపట్టనున్నారు. చర్చించి పరిష్కరించుకుందామన్న ఏపీ సీఎం చంద్రబాబు లేఖకు సానుకూలంగా స్పందించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతి లేఖ పంపారు. 'చర్చించుకుందాం రండి' అంటూ ఆహ్వానం పంపారు. ఈ క్రమంలో ఇరు రాష్ట్రాల సీఎంల భేటీకి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రజాభవన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు సమావేశం కానున్నారు.

కాగా, విభజనకు సంబంధించి అపరిష్కృత అంశాలపై ముఖ్యమంత్రులు భేటీ కావడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇరువురి నేతల మధ్య ప్రధానంగా షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న సంస్థల విభజన సహా, ఇతర అంశాలు సైతం చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం ఇరు రాష్ట్రాల అధికారులు చర్చల ప్రాతిపదికకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేశారు. ప్రధానంగా విద్యుత్ సంస్థలకు సంబంధించి బకాయిలపైనే సమస్య అపరిష్కృతంగా ఉంది. ఏపీ ప్రభుత్వం దాదాపు రూ.24 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం చెబుతుండగా.. తెలంగాణనే తమకు రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. కాగా, ఇరు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన క్రమంలో విభజన అంశాలు సహా ఇతర అపరిష్కృత సమస్యలపైనా చర్చకు ముందడుగు పడింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన చొరవతో ఈ ఏడాది మార్చిలో ఏపీ భవన్‌కు సంబంధించిన విభజన వివాదం పరిష్కారమైంది. ఇటీవలే మైనింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల పంపిణీకి సంబంధించిన సమస్య సైతం పరిష్కార మయ్యాయి. విభజన వివాదాలపై ఇప్పటివరకూ ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య దాదాపు 30 సమావేశాలు జరిగాయి. అయితే, షెడ్యూల్ 9లో ఉన్న మొత్తం 91 సంస్థల ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీపై కేంద్ర హోంశాఖ షీలాబేడీ కమిటీ వేసింది. వీటిలో 68 సంస్థలకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు లేవు. ఇక మిగిలిన 23 సంస్థల పంపిణీపై ఏకాభిప్రాయం కుదరలేదు. అటు, 10వ షెడ్యూల్‌లోని 142 సంస్థల్లో తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్శిటీ, అంబేడ్కర్ యూనివర్శిటీ వంటి 30 సంస్థల పంపిణీపై ఇంకా వివాదాలున్నాయి.

ఈ అన్ని అంశాలపై శనివారం ముఖ్యమంత్రుల భేటీలో ఓ పరిష్కారం దొరకవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే, కృష్ణా జలాల పంపిణీ, కోర్టుల్లో ఉన్న పిటిషన్లు వెనక్కు తీసుకోవడం సహా.. భద్రాచలం మండలంలోని 5 గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వడం, తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల విభజన, ఉమ్మడి సంస్థల ఆస్తులు, అప్పుల పంపిణీలో నెలకొన్న ప్రతిష్టంభన ఇలాంటి అనేక విషయాలు ఓ కొలిక్కి వస్తాయని ఇరు రాష్ట్రాల నేతలు, అధికారులు భావిస్తున్నారు.

# తగిన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట

మొదటిపేజీ తరువాయి..

నేను ఈ విషయాన్ని రాజకీయ కోణం నుండి చెప్పదలచుకోలేదు, కానీ పరిపాలనలో లోపాలు ఉన్నాయి, ముఖ్యమైన విషయం ఏమిటంటే? వారు పేదవారు కాబట్టి గరిష్ట పరిహారం ఇవ్వాలి. నష్టపరిహారం విషయంలో జాప్యం జరిగితే ఎవరికీ ప్రయోజనం ఉండదని యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్‌ని కోరుతున్నాను వారు షాక్‌లో ఉన్నారు, నేను వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలనుకున్నానని రాహుల్ గాంధీ సమావేశం అనంతరం తెలిపారు.

# మరోసారి నిరాశ

మొదటిపేజీ తరువాయి..

ఫలితం దక్కలేదు. ఆమె దాఖలు చేసిన పిటిషన్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను ట్రయల్ కోర్టు పొడిగించింది. ఆమె జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు జులై 18 వరకు పొడిగించింది. సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్ శుక్రవారంతో ముగిసింది. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. ఈ కేసులో కవితను సిబిఐ ఏప్రిల్ 11న అరెస్ట్ చేసింది. అంతకుముందే, ఈడి ఆమెను అరెస్ట్ చేసింది. తీహార్ జైల్లో ఉన్న కవితను ప్రశ్నించిన సిబిఐ, ఆ తర్వాత అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈడితో పాటు సిబిఐ కేసులలో కవిత చాలాకాలంగా జైల్లో ఉన్నారు. ఆమె బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ కోర్టులో తిరస్కరణ ఎదురవుతోంది. కాగా కవితకు బెయిల్ దక్కకపోవడంపై బీఆర్ఎస్ వర్గాలు తీవ్ర నిరాశకు గరవుతున్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో క్రియాశీలక నాయకురాలైన కవిత జైలులో ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక కీలక నేతల జంపింగ్‌లతో బీఆర్ఎస్ సతమతమవుతున్న విషయం తెలిసిందే. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు ఇప్పటికే అధికార కాంగ్రెస్ గూటికి చేరారు.

# ఈనెల 10 నుంచి 12వ తేదీలలో వ్యవసాయ డిప్లొమా కోర్సుల కౌన్సిలింగ్

(మొదటి పేజీ తరువాయి)

పొందిన అభ్యర్థులను మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారముగా ప్రవేశాలు నిర్వహిస్తారు.

ఈ కౌన్సిలింగ్‌కి సంబంధించిన షెడ్యూల్, అభ్యర్థులు తీసుకురావలసిన సర్టిఫికెట్లు, ఫీజు తదితర వివరాల కొరకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.pjt-sau.edu.in ను చూడగలరు. అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు షెడ్యూల్ ప్రకారం వారి ర్యాంకుల వారిగా కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామి రెడ్డి తెలియజేశారు.

# ఇక పాతపద్ధతిలోనే ప్రసాదాల తయారీ

**సాధారణ బియ్యం వినియోగించాలని టిటిడి నిర్ణయం**

తిరుమల,జూలై5(నమస్తే ఉదయం): కలియుగ వైకుంఠ నాథుడైన తిరుమలేశుడికి నివేదించే అన్న ప్రసాదాలపై టీటీడీ కీలక నిర్ణయం తీసుకోనుంది. సేంద్రీయ బియ్యం స్థానంలో సాధారణ బియ్యం వినియోగించాలని భావిస్తోంది. త్వరలోనే స్వామివారికి సాధారణ బియ్యంతో చేసిన అన్న ప్రసాదాలను టీటీడీ నివేదించనుంది. శ్రీవారి ప్రసాదాల తయారీలో టీటీడీ ఎప్పుడు మార్పులు చేసింది.. తిరిగి పాతపద్ధతిని స్వామివారికి ప్రసాదాలు నివేదించాలని.. టీటీడీ నిర్ణయం తీసుకుంది. వైభోగవంతుడైన శ్రీనివాసునికి ఉత్సవాల నిర్వహణెలి కాదు.. స్వామివారికి నివేదించే ప్రసాదాల్లోనూ చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఆచార నియమాలతో శ్రీనివాసునికి దాదాపు 50 రకాల ప్రసాదాలు నివేదిస్తారు. కానీ అనునిత్యం తిరుమలను దర్శించుకునే వేలాది మంది భక్తులకు తెలిసిన ఒకే ఒక్క ప్రసాదం లడ్డూ మాత్రమే. భువిపై అమృతంగా చెప్పుకునే లడ్డూ భక్తులకు మహా



ప్రసాదం. ఆర్జిత సేవల్లో స్వామివారిని దర్శించుకునే భక్తులకు వడ, దోశ, జిలేబి, మహా లడ్డు వంటి ప్రసాదాలు అందిస్తాయి. దర్శనం పూర్తి అయిన తర్వాత పులిహోర, పొంగలి, దద్దొజనం ప్రత్యేక వంటకాలు. కానీ శ్రీవారికి అనునిత్యం షడ్రసోపేతమైన పదార్థాలతో నిత్య నైవేద్యం జరుగుతుంది. నిత్య కల్యాణ చక్రవర్తి తిరుమల వెంకన్నకు ఆగమ శాస్త్రం ప్రకారం కైంకర్యాలు, నివేదను జరుగుతాయి. వెయ్యేళ్ల క్రితం రామానుజాచార్యులు నిర్దేశిరచిన నిబంధనలే నేటికీ శ్రీవారి ఆలయంలో అమలు చేస్తున్నారు. ఆ మేరకే శ్రీవారికి నివేదనలు జరుగుతున్నాయి. స్వామివారికి సుప్రభాత సేవ నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు నివేదనలు సమర్పిస్తారు. రోజూ జరిగే నిత్య సేవలు, విరామ సమయంలో వివిధ రకాల నివేదనలు జరుగుతాయి. శతాబ్దాల తరబడి స్వామివారి ప్రసాదాలను అర్చకలు నివేదిస్తుండగా 2021 మే నెలలో నాటి వైసీపీ ప్రభుత్వంలోని టీటీడీ బోర్డు మార్పులు చేసింది. పూర్వకాలపు ఆచారం పేరుతో సేంద్రీయ బియ్యంతో తయారు చేసిన ప్రసాదాలను స్వామివారికి నివేదించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. 15 రకాల సేంద్రీయ బియ్యంతో ప్రసాదాలు తయారు చేస్తోంది.



## బిజెపి యువమోర్చా నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

### పిఎస్‌సి వద్ద ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

**రాజేంద్రనగర్, జూలై5(నమస్తే ఉదయం):**
ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ప్రభుత్వంపై నిరసిస్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు బిజెవైఎం తలపెట్టిన ఆందోళన కు తరలి వెళ్లకుండా రాజేంద్రనగర్ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్టు చేశారు. శుక్రవారం భారతీయ జనతా యువమోర్చా తలపెట్టిన టి పి ఎస్ సి ముట్టడి కార్యక్రమాన్ని అణిచివేసే దిశగా పోలీసులతో యువ మోర్చా నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయిస్తూ నిరుద్యోగులకు విద్యార్థులకు తీరని నష్టాన్ని కలిగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర యువమోర్చా మీడియా కోఆర్డినేటర్ కుక్కునూరి కిరణ్ చారి ఆరోపించారు. అత్తాపూర్ డివిజన్ యువమోర్చా అధ్యక్షులు సులిగె మణికంఠ ,సందీప్ , బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేసి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ఫోక్సో కేసులో ముద్దాయికి పది సంవత్సరాల జైలు శిక్ష

### - పది వేల జరిమానా



**రాజేంద్రనగర్, జూలై5(నమస్తే ఉదయం):**
ఫోక్సో కేసులో ముద్దాయికి రాజేంద్రనగర్ కోర్టు ముద్దాయికి పది సంవత్సరాల జైలు శిక్ష విధించింది. శంషాబాద్ ఆర్‌జిఐఏ పోలిస్ స్టేషన్ పరిదిలో 2017లో శంషాబాద్‌కి చెందిన మైనర్ బాలికను హుడా కాలనీకి చెందిన జర్పుల శివ నమ్మించి మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన కేసులో రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు న్యాయమూర్తి పి. ఆంజనేయులు నేరం రుజువు కావడంతో ముద్దాయికి పది సంవత్సరములు జైలుశిక్ష పది వేల రూపాయిల జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేంకటేశ్వర రెడ్డి తమ వాదనలను వినిపించారు. ఈసందర్భంగా తప్పు చేసే వారిపైన కోర్టులు కఠినమైన నిర్ణయాలను తీసుకుంటాయని న్యాయమూర్తి తెలియజేసారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**కొత్తకోట, జూలై 5(నమస్తే ఉదయం):**
కొత్తకోట మండల కేంద్రంలోని మధనాపురం రోడ్డులోని సాయిబాబా దేవాలయం సమీపంలో అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపారు. ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. శు



క్రవారం బొలెరో వాహనంలో మధనాపురం నుండి షాద్ నగర్‌కు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారని, వాహనాల తనిఖీలల్లో భాగంగా ఈ పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని, సివిల్ సప్లయ్ అధికారి నంద కిషోర్ పంచనామా చేసి పిర్యాదు ఇవ్వగా బొలెరో డ్రైవర్ పరమేశ్ తో పాటు వాహన యజమాని వడ్డె శివపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## పాలమూరు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా - ఎంపీ డీకే అరుణ

### ఎంపీ డీకే అరుణ కు నియోజకవర్గ సమస్యలు వివరించిన బిజెపి ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర, జూలై5(నమస్తే ఉదయం):**
పాలమూరు సమగ్ర అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. శుక్రవారం ఇటీవల పార్లమెంటు సభ్యురాలుగా ఎంపికైన డీకే అరుణ దేవరకద్ర నియోజకవర్గం వివిధ మండలాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జిలు,




జిల్లా , రాష్ట్రస్థాయి నాయకులతో సమావేశమై ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రగతి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పనులను ప్రతి నాయకుడు కార్యకర్త చైత్ర స్థాయిలో తీసుకెళ్లి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. తాను ప్రజలకు పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తన ప్రాంతాలలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి ,పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ వివిధ సమస్యలపై చర్చించారు.
ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , పార్లమెంటు ప్రబారి కె వి ఎల్ ఎన్ రాజు, రాష్ట్ర నాయకులు ఎగ్గని నరసింహులు , రవీందర్ రెడ్డి , మండలాల అధ్యక్షులు, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్ మెట్లెక్కిన గద్వాల పంచాయతీ

### గద్వాల ఎమ్మెల్యే బండ్లకు లైన్ క్లియరెన్స్

### గాంధీ భవన్ ముందు నిరసన తెలుపుతున్న సరితా అభిమానులు



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై5(నమస్తే ఉదయం):**
గద్వాల రాజకీయాలు గాంధీభవన్ మెట్లు ఎక్కాయి.
బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లోకి చేరుతున్నట్లు అధిష్టానం నుంచి లైన్ క్లియరెన్స్ అందడంతో ఇక చేరిక లాంఛనమే అని అందరూ బావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గద్వాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయిన మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య గురువారంతో తన పదవీకాలం ముగిసింది. ఇప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి హామీ దక్కకపోవడంతో సరిత వర్గంలో ఆందోళన మొదలైంది. అప్పటికే బబీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధం కావడంతో గద్వాల ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలోకి వస్తే తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందేమో అని సరిత వర్గీయులు ఆందోళన బాట పట్టారు. గద్వాల ఎమ్మెల్యే కాంగ్రెస్ లోకి రానిచ్చేది లేదంటూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గత రెండు రోజులుగా మాజీ జెడ్పి చైర్మన్ సరితా తిరుపతయ్య అనుచరులు తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపట్టి అదిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది.. ఐతే శుక్రవారం మాజీ జెడ్పీ చైర్‌పర్శన్ సరిత భారీగా తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవొద్దంటూ ఆమె కాంగ్రెస్ పెద్దలు కలసి విన్నవించారని సమాచారం. గతంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి నివాసంలో గద్వాల ఎమ్మెల్యే రాకను తీవ్రంగా వ్యతిరేకించరని తెలిసింది. ఐతే సరితా తిరుపతయ్య అనుచరులు మాత్రం గాంధీ భవనం ముందు నిరసన చేసి ధర్నా నిర్వహించారు.
ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... సరితా తిరుపతయ్య నాయకత్వంలోనే గద్వాల నియోజక వర్గం ఉండాలని, సరితకు తగు సముచిత స్థానం కల్పించాలని అనుచరులు అదిష్టానాని కోరుతున్నారు. ఏది ఏమైనా గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ సరిత అనుచర వర్గం చేస్తున్న అందోళనలు రాష్ట్ర రాజదానికి చేరుకోవడంతో రానున్న రోజులో ఆందోళనలు ఉద్రిక్తం చేస్తారా లేక అదిష్టానం ఆందోళనకు తెరదింపుతుందా వేచిచూడాలి మరీ..

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ ఏఈ



**రాజేంద్రనగర్,జులై 05(నమస్తే ఉదయం):**
ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటున్న ఇంజనీరింగ్ ఏఈ ఏసీబీ వలకు చిక్కాడు.ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.కేసు వివరాలను శుక్రవారం మధ్యాహ్నం ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మీడియాకు వెల్లడించారు.
నగరంలోని పాతబస్తీ సంతోష్ నగర్‌కు చెందిన ముజాఫరుద్దీన్ అనే కాంట్రాక్టర్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఆదర్శనగర్ లో రూ.6.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు.దానికి సంబంధించిన రూ.6.5 లక్షల చెక్కును ఇవ్వడానికి ఏఈ బలవంత్ రెడ్డి కాంట్రాక్టర్ ముజాఫరుద్దీన్‌ను రూ.24 వేలు లంచంగా డిమాండ్ చేశారు. చివరకు బేరసారాల అనంతరం రూ.15 వేలు ఇచ్చేందుకు అతను అంగీకరించాడు.ఈ క్రమంలో కాంట్రాక్టర్ ముజాఫరుద్దీన్ ఏఈ బలవంత్ రెడ్డి తీరుపై ఏసీబీకి ఫిర్యాదు చేశాడు.శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఏఈ బల్వంత్ రెడ్డి కాంట్రాక్టర్ నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా...ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ సీఐల బృందం సర్కిల్ కార్యాలయంలోని ఏఈ చాంబర్లో డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.రసాయన పరీక్షల్లో అతను డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ జరిగింది.ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. అతని ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వండి... ఎవరైనా ప్రభుత్వాధికారులు పనులు చేసేందుకు లంచం డిమాండ్ చేస్తే తమకు ఎప్పుడైనా సమాచారం ఇవ్వవచ్చని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ తెలిపారు.తమ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. లంచం తీసుకునే అధికారుల భరతం పడతామని ఆయన హెచ్చరించారు.

# గణేష్ నిమజ్జనానికి చెరువుల ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టిన ఉత్సవ కమిటీ

### పత్తి కుంట, హనుమాన్ సాగర్‌ల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, గణేష్ నిమజ్జనానికి ముస్తాబు..

### గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ముమ్మరంగా పనులు..



పత్తి కుంటలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న బిజెపి నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధి వై.శ్రీధర్


**రాజేంద్రనగర్,జూలై 05(నమస్తే ఉదయం):**
గణేష్ నిమజ్జనం పురస్కరించుకొని రాజేంద్రనగర్ పత్తి కుంట,హనుమాన్ సాగర్ లను జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో శుభ్రం చేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.గురువారం నుండి జెసిబి ద్వారా రెండు ట్రాక్టర్స్‌తో మట్టి,చెత్త,పేరుకుపోయిన ముళ్ళకంపలను తొలగిస్తున్నారు. గత నెల జూన్‌లో రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు జోనల్ కమిషనర్ వెంకన్నకు చెరువులు శుభ్రం చేయమని వినతి పత్రం అందజేశారు.వర్షాలు కురిసే ముందే పత్తి కుంట శుభ్రం చేయాలి జోనల్ కమిషనర్ కు విన్నవించారు.వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ సర్కిల్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్,ఇంజనీరింగ్ ఈఈ నరేందర్ గౌడ్,ఏఈ వెంకోబా సహకారంతో పనులు చేపడుతున్నారు.ఈ పనులను గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు వై.శ్రీధర్ జి.బాబురావు, భాస్కర్ యాదవ్,తోండుపల్లి మల్లేష్, పవన్ రాజ్, డి.యాదగిరి, జంగయ్య, భీమయ్య పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల కమిటీ ప్రతినిధి వై.శ్రీధర్ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనం లోపే పత్తికొండ, హనుమాన్ సాగర్‌లను శుభ్రం చేస్తున్నామని తెలిపారు.వర్షాలు కురుస్తున్నడంతో చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి నిమజ్జనానికి ఏర్పాట్లు చేసి జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా చెరువులు,కుంటలను సుందరీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు.

# నాకు ధైర్యాన్నిచ్చి నడిపించిన అందరికీ కృతజ్ఞతలు

### కొత్తకోట జడ్‌పిటిసి, డ్వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్



**కొత్తకోట, జూలై 5(నమస్తే ఉదయం):**
తనకు ధైర్యం ఇచ్చి ముందుకు నడిపించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరికీ కొత్తకోట జడ్పిటిసి, డ్వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం కొత్తకోట మండలం జడ్పిటిసిగా ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మీడియాకు ప్రకటన విడు దల చేశారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ సహకారంతో దేవరకద్ర మా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆశీర్వాదంతో తనకు డ్పిటీసీగా, డ్వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన కొత్తకోట మండల ప్రజలకు, నాయకులకు, కార్యకర్త లకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరు పేరున నా కృతజ్ఞతలు చెప్పారు. రాజకీయంగా ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఉన్న నాకు మేమున్నామని ధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డికి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులకు, మా డ్పిటీసీ విశ్వేశ్వర్, మా ఎంపీపీ గుంత మౌనిక కు, సిడిసి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, టిఆర్ఎస్ అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, గిన్నె కొండారెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ జగ న్మోహన్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసులు, తోటి జడ్పిటిసిలకు, ఎంపీపీలకు, సర్పంచులకు, ఎంపిటీసీలకు, డిప్యూటీ సర్పంచులకు, ప్రభుత్వ గ్రామ, మండల , జిల్లా స్థాయి, మండల పరిషత్, జిల్లా పరిషత్, మహిళా సంఘాల, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్వాడి, అధికారులు , సిబ్బందికి నా కృతజ్ఞతలు.
జెడ్పిటిసిగా నన్ను, నేను చేసిన కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన విలేకరులకు, సోషల్ మీడియా ప్రతినిధులకు నా ప్రత్యేకమైన కృతజ్ఞతలు అని తెలిపారు.
మా ఈ ప్రయాణం సజావుగా సాగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.



## అక్టోబర్ 10న 'కంగువ'

స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'కంగువ' అక్టోబర్ 10న దసరా పండుగ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సినిమాను నైజాం ఏరియాలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నారు. ఇటీవల పలు సూపర్ హిట్ చిత్రాలను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది.

ప్రెస్టీజియస్ మువీ 'కంగువ'ను నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ పంపిణీ చేస్తుండటంతో మరింత ఎగ్జైట్ మెంట్ ఏర్పడుతోంది. 'కంగువ' చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కంగువ' సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

## 'జీబ్రా' నుంచి సత్యదేవ ఫస్ట్ లుక్

టాలెంటెడ్ హీరో సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ, ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న మల్టీస్టారర్‌లో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. 'జీబ్రా' అనే టైటిల్ తో రూపొందతున్న ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్లపై ఎస్ ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో సత్యదేవ్‌ని



సూట్‌లో స్టైలిష్ అవతార్‌లో ప్రెజెంట్ చేశారు. అయితే తను ఇంటెన్స్ చూపులతో చాలా సీరియస్‌గా కనిపిస్తున్నారు. అతను భుజంపై బ్యాగ్ పట్టుకొని ఫెరోషియస్ గా నడుస్తూ కనిపించారు. మరో చేతిలో పెన్ను ఉంది. బ్యాక్ గ్రౌండ్ పోస్టర్ లో సత్యదేవ్, కరెన్సీ నోట్లను చూపించారు. సినిమాలో సత్యదేవ్ క్యారెక్టర్ ఎంత ఇంటెన్స్‌గా ఉండబోతుందో ఫస్ట్ లుక్ ద్వారా తెలుస్తోంది. లక్ ఫేవర్స్ ది బ్రేవ్ అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

## జూలై 19న అంజలి 'బహిష్కరణ' స్ట్రీమింగ్

యాభైకి పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా, విలక్షణ పాత్రల్లో మెప్పించిన నటి అంజలి. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో జీ 5, పిక్సెల్ పిక్చర్స్ ఇండియా బ్యానర్స్‌పై రూపొందుతోన్న వెబ్ సిరీస్ 'బహిష్కరణ'. ముఖేష్ ప్రజాపతి ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. విలేజ్ రివేంజ్ డ్రామా జోనర్‌లో రూపొందుతోన్న ఈ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉంటాయి. ఈ వెబ్ సిరీస్ జూలై 19 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ క్రమంలో మీడియాతో 'బహిష్కరణ' యూనిట్ ముచ్చటించింది. హీరోయిన్ అంజలి, దర్శక, నిర్మాతలు చెప్పిన విశేషాలివే.. పిక్సెల్ పిక్చర్స్ ప్రై. లి. అధినేత, నిర్మాత ప్రశాంతి మలిశెట్టి.. 'జీ5తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. జీ5తో మాకు లోకల్ కథలను గ్లోబల్ వైడ్‌గా చెప్పగలమనే నమ్మకం ఏర్పడింది. అంజలి ఇది వరకెన్నడూ చేయనటువంటి, పోషించనటువంటి పాత్రలో కనిపిస్తారు.మా దర్శకుడు ముఖేష్ ప్రజాపతి, అసాధారణమైన కథతో, ఎంతో లోతైన ఎమోషన్స్‌తో మరెంతో ఉద్వేగభరితమైన వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. పిక్సెల్ పిక్చర్స్‌లో కంటెంట్ కింగ్.. కాంటెక్స్ట్ గాడ్ అని నమ్ముతాం. మన సమాజంలోని వాస్తవికతలను, పరిస్థితులను ప్రతిబింబించేలా ఈ సిరీస్ ఉండనుంది. జీ5 వంటి జాతీయ ప్లాట్‌ఫాంలలో ప్రాంతీయ కంటెంట్‌లకు ప్రాధాన్యత పెరిగింది. మా సిరీస్ దేశ వ్యాప్తంగా అందరికీ నచ్చుతుందని భావిస్తున్నామ' అని అన్నారు.



# ఆరు నెలలు.. హిట్లు.. ఫట్లు


**2024 మొదలయి అప్పుడే ఆరు నెలలు అయిపోయింది. ఈ ఆరు నెలల్లో బాగానే సినిమాలు వచ్చాయి. ప్రతి సమ్మర్ పెద్ద సినిమాలతో బిజీగా ఉండే సినీ పరిశ్రమ థియేటర్లు, ఈ సారి ఎన్నికలు, ఐపీఎల్ తో ఖాళీగానే ఉంది. మొత్తం ఈ ఆరు నెలల్లో కొన్ని సినిమాలు ప్రేక్షకులని మెప్పించాయి.. కొన్ని మాత్రం ప్రేక్షకులకు తెలియకుండానే వెళ్లిపోయాయి.అయితే, ఈసారి ఐపీఎస్, టీ20 క్రికెట్ సంబురంలో సినీ ప్రేక్షకులు వెనకబడ్డారు. దీంతో దర్శకులు, నిర్మాతలు కూడా తమ సినిమాలను తెరపైకి తీసుకురాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 2024 తొలి ఆరు నెలలు సినీ ఇండస్ట్రీకి కొంత గడ్డు రోజులే. ఈ ఆరు నెలల్లో ఎన్ని సినిమాలు హిట్ అయ్యాయి.. ఎన్ని ఫట్ అయ్యాయో లెక్కేద్దాం.**

### తొలి నెలలో హనుమాన్, గుంటూరు కారం

జనవరిలో నూతన సంవత్సరం జనవరి 1 సింగర్ సునీత కొడుకు ఆకాష్ హీరోగా పరిచయమవుతూ వచ్చిన సినిమా సర్కారు నౌకరి. ఇది ఎమోషనల్ గా ప్రేక్షకులని మెప్పించిన కమర్షియల్‌గా వర్కౌట్ అవ్వలేదు. దీంతో పాటు మరో మూడు చిన్న సినిమాలు కూడా రిలీజ్ అయ్యి పరాజయం పాలయ్యాయి. జనవరి 5న ఏకంగా 5 చిన్న సినిమాలు రిలీజ్ అయ్యాయి. వాటిలో చెప్పుకోడానికి ఒక్క సినిమా కూడా ఆడకుండా రిలీజ్ అయి వెళ్లిపోయాయి. ఇక సంక్రాంతి రేసులో జనవరి 12న మహేష్ బాబు గుంటూరు కారం, తేజ సజ్జ హనుమాన్ సినిమాలు రిలీజ్ అయి రెండు భారీ హిట్స్ కొట్టాయి. గుంటూరు కారం సినిమా 200 కోట్లు కలెక్ట్ చేస్తే హనుమాన్ ఎవ్వరూ ఊహించని పెద్ద హిట్ అయి 300 కోట్లు కలెక్ట్ చేసి 50 రోజుల లాంగ్ రన్ నడిచింది. జనవరి 13న వెంకటేష్ సైంధవ్ సినిమా రిలీజయింది. ఈ సినిమా నిరాశపరిచింది. జనవరి 14న నాగార్జున నా సామిరంగ రిలీజయి డీసెంట్ హిట్ కొట్టి బ్రేక్ ఈవెన్ అయింది. జనవరి 26న హన్సిక 105 మినిట్స్ సినిమాతో పాటు మరో 5 చిన్న సినిమాలు రిలీజయ్యాయి. ఇవేవి థియేటర్స్ వద్ద నిలబడలేదు.

### అంబాజీపేటకు బ్రాడ్ బ్యాండ్

ఇక ఫిబ్రవరిలో ఫిబ్రవరి 2న సుహాస్ అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, బిగ్ బాస్ ఫేమ్ సోహైల్ బూట్ కట్





బాలరాజు సినిమాలతో పాటు 7 చిన్న సినిమాలు రిలీజ్ అయ్యాయి. వీటిల్లో అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ డీసెంట్ హిట్ నిలవగా మిగిలిన సినిమాలన్నీ అడ్రెస్ లేకుండా పోయాయి. ఫిబ్రవరి 8న వైఎస్ జగన్ బయోపిక్ గా తెరెకెక్కిన యాత్ర 2 సినిమా రిలీజయింది కానీ ఈ సినిమా ప్రేక్షకులని మెప్పించలేకపోయింది. ఫిబ్రవరి 9న రవితేజ ఈగల్ సినిమా



రిలీజవ్వగా యావరేజ్ గా నిలిచింది. ఫిబ్రవరి 15 అమరావతి రైతుల మీద తీసిన రాజధాని ఫైల్స్ రిలీజయింది. ఫిబ్రవరి 16న సుందీప్ కిషన్ ఊరుపేరు భైరవకోన సినిమాతో వచ్చి చాలా రోజుల తర్వాత మంచి హిట్ కొట్టాడు. అదే రోజు మరో చిన్న సినిమా రిలీజయింది. ఫిబ్రవరి 23న సుందరం మాస్టర్, మస్త్ షేడ్స్ ఉన్నాయి రాతో పాటు మరో 5 చిన్న సినిమాలు రిలీజ్ అయ్యాయి. కమెడియన్ వైవా హర్ష హీరోగా మారి తెరకెక్కించిన సుందరం మాస్టర్ యావరేజ్ గా నిలిచింది. కమెడియన్ అభినవ్ గోమటం హీరోగా మారి తెరకెక్కిన మస్త్ షేడ్స్ ఉన్నాయి రాతో పాటలు మిగిలిన చిన్న సినిమాలు కూడా ఫ్లాప్ దారి పట్టాయి.

### బెడిసిన వ్యూహం

మార్చ్ 1న భూతద్దం భాస్కర్ నారాయణ, చారి 111, ఆపరేషన్ వాలెంటైన్, వ్యూహంతో పాటు 4 చిన్న సినిమాలు రిలీజయ్యాయి. శివ కందుకూరి హీరోగా తెరకెక్కిన భూతద్దం భాస్కర్ నారాయణ పాజిటివ్ టాక్ తెచ్చుకున్నా యావరేజ్ గా నిలిచింది. వరుణ్ తేజ్ ఆపరేషన్ వాలెంటైన్, వెన్నెల కిషోర్ చారి 111, ఆర్జీవీ వ్యూహంతో పాటు మిగిలిన సినిమాలు అన్ని పరాజయం పాలయ్యాయి. మార్చ్ 8 గామి, భీమలతో పాటు 4 చిన్న సినిమాలు రిలీజ్ అయ్యాయి. విశ్వక్ సేన్, చాందిని చౌదరి ముఖ్య పాత్రల్లో ప్రయోగాత్మకంగా తీసిన గామి సినిమా మంచి హిట్ అయింది. గోపీచంద్ భీమతో పాటు మిగిలిన సినిమాలు కూడా నిరాశ పరిచాయి. మార్చ్ 15న రజాకార్, లంబసింగి, షరతులు వర్తిస్తాయి, వెయ్ దరువేయ్, తంత్రలతో పాటు మరో 3 చిన్న సినిమాలు రిలీజ్ అయ్యాయి. భారతదేశంలో నైజాం విలీనంపై తీసిన రజాకార్ అందర్నీ మెప్పించి యావరేజ్ గా నిలిచింది. ఇక మిగిలిన సినిమాలన్నీ నిరాశ పరిచాయి. మార్చ్ 22 ఓం భీం బుష్, లైన్ మ్యాన్ తో పాటు మరో 3 చిన్న సినిమాలు రిలీజవ్వగా శ్రీ విష్ణు ఓం భీమ్ బుష్ హిట్ అవ్వగా మిగిలిన సినిమాలు ఫ్లాప్ బాట పట్టాయి. మార్చ్ 29న సిద్ధూ జొన్నలగడ్డ టిల్లు స్క్వేర్ సినిమా రిలీజయి 100 కోట్లు కలెక్ట్ చేసి భారీ హిట్ కొట్టింది. అదే రోజు 3 చిన్న సినిమాలు రిలీజయి అడ్రెస్ లేకుండా పోయాయి.

### ఫ్యామిలీ స్టార్ బయటే

ఇక ఏప్రిల్ 5న విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ సినిమా రిలీజయి యావరేజ్ గా నిలిచింది. అదే రోజు మరో 2 చిన్న సినిమాలు రిలీజయినా ఫ్లాప్ అయ్యాయి. ఏప్రిల్ 11న అంజలి గీతాంజలి సినిమాకు సీక్వెల్ గా గీతాంజలి మళ్ళీ వచ్చింది సినిమా రిలీజయి యావరేజ్ గా నిలిచింది. సుహాస్ శ్రీరంగ నీతులు సినిమా నిరాశ పరిచింది. ఏప్రిల్ 12న 2 చిన్న సినిమాలు రిలీజయినా ఎవ్వరికి తెలియకుండానే వెళ్లిపోయాయి. ఏప్రిల్ 18న సత్యం రాజేష్ ముఖ్య పాత్రలో చేసిన టెనెంట్ రిలీజయి నిరాశ పరిచింది. ఏప్రిల్ 19 మార్కెట్ మహాలక్ష్మి, పారిజాతాపర్వం, మరో 2 చిన్న సినిమాలు, ఏప్రిల్ 26 రెండు చిన్న సినిమాలు రిలీజయి ఇవన్నీ అడ్రెస్ లేకుండా పోయాయి.

### భజే 'వాయు' వేగంగా..!

మే 3న ఆ ఒక్కటి అడక్కు, బాక్, ప్రసన్న వదనం,



శబరి, మరో చిన్న సినిమా రిలీజవ్వగా అన్ని కమర్షియల్ గా ఫ్లాప్స్ గా మిగిలాయి. డబ్బింగ్ సినిమా బాక్ మాత్రం సినిమా బాగున్నా తెలుగులో ఫ్లాప్ అయి తమిళ్ లో హిట్ అయింది. సుహాస్ ప్రసన్న వదనం సినిమా కూడా బాగున్నా కమర్షియల్ ఫ్లాప్ అయింది. మే 10 సత్యేదేవ్ కృష్ణమ్మ, నారా రోహిత్ ప్రతినిధి 2, మరో 3 చిన్న సినిమాలు రిలీజయి అన్ని నిరాశ పరిచాయి. మే 17న అసలు ఎవరికీ తెలియని ఓ 3 చిన్న సినిమాలు రిలీజయి అటు నుంచి ఆటే వెళ్లిపోయాయి. మే 24 గెటప్ శ్రీను హీరోగా చేసిన రాజు యాదవ్ సినిమాతో పాటు మరో 5 చిన్న సినిమాలు రిలీజయి అన్ని పరాజయం పాలయ్యాయి. మే 25న ఆశిష్, వైష్ణవి చైతన్య నటించిన లవ్ మీ ఇఫ్ యు డేర్ సినిమా యావరేజ్ గా నిలిచింది. మే 31న




రిలీజయిన కార్తికేయ భజే వాయు వేగం, ఆనంద్ దేవరకొండ గం గం గణేశా, విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలు యావరేజ్ గా నిలిచాయి. ఇలా ఏప్రిల్, మే సమ్మర్ అంతా ఒక్క పెద్ద హిట్ కూడా లేకుండానే గడిచిపోయింది.

### కల్కి మానియా

ఇక జూన్ 7న నవదీప్ లవ్ మౌళి, శర్వానంద్ మనమే, కాజల్ అగర్వాల్ సత్యభామ సినిమాలు రిలీజయి యావరేజ్ గా నిలవగా పాయల్ రాజ్ పుత్ రక్షణ సినిమాతో పాటు మరో 4 చిన్న సినిమాలు రిలీజయి పరాజయం పాలయ్యాయి. జూన్ 14న సుధీర్ బాబు హరోం హర, చాందిని చౌదరి ఏవమ్, మ్యూజిక్ షాప్ మూర్తి సినిమాలతో పాటు మరో 2 చిన్న సినిమాలు రిలీజయ్యాయి. ఇందులో మ్యూజిక్ షాప్ మూర్తి సినిమా బాగున్నా కమర్షియల్ గా సక్సెస్ అవ్వలేదు. మిగిలిన సినిమాలన్నీ నిరాశపరిచాయి. జూన్ 21న వరుణ్ సందేశ్ నింద, హెబ్బా పటేల్ హనీమూన్ ఎక్స్ ప్రెస్ తో పాటు మరో 6 చిన్న సినిమాలు రిలీజయి పరాజయం పాలయ్యాయి. జూన్ 22న హెబ్బా పటేల్ సందేహం సినిమా ఫ్లాప్ గానే నిలిచింది. ఇక తాజాగా జూన్ 27న వచ్చిన ప్రభాస్ కల్కి 2898%ూణ% సినిమా భారీ హిట్ కొట్టింది. ఇప్పటికే 300 కోట్ల గ్రాస్ వసూలు చేసి దూసుకుపోతుంది.

### డబ్బింగ్.. గేమింగ్

ఇక డబ్బింగ్ సినిమాల్లో జనవరిలో వచ్చిన ధనుష్ కెప్టెన్ మిల్లర్ పరాజయం పాలైంది. ఫిబ్రవరిలో లవర్, మంజుమ్మెల్ బాయ్స్ సినిమాలు యావరేజ్ గా నిలిచాయి. రజినీకాంత్ లాల్ సలాం సినిమా, భ్రమయుగం సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. మార్చ్ లో రిలీజయిన ప్రేమలు సినిమా పెద్ద హిట్ గా నిలవగా పృథ్వీరాజ్ ఆడు జీవితం యావరేజ్ గా నిలిచింది. ఏప్రిల్ లో వచ్చిన డియర్, రత్నం సినిమాలు ఫ్లాప్ అవ్వగా, లవ్ గురు సినిమా యావరేజ్ గా నిలిచింది. మేలో వచ్చిన బాక్ సినిమా యావరేజ్ గా నిలవగా, జూన్ లో వచ్చిన విజయ్ సేతుపతి సినిమా పెద్ద హిట్ గా నిలిచింది.

మొత్తంగా ఫస్ట్ హాఫ్ లో మంచి హిట్ అయి డబ్బులు వచ్చిన సినిమాలు అంటే హనుమాన్, గుంటూరు కారం, నా సామిరంగ, గామి, ప్రేమలు, ఓం భీమ్ బుష్, టిల్లు స్క్వేర్, కల్కి సినిమాలు మాత్రమే. కల్కి ఇప్పుడు రాబడుతుంది. ఇక కొన్ని సినిమాలు మంచి టాక్ వచ్చినా కమర్షియల్‌గా ఫెయిల్ అయ్యాయి. ఈ సారి సమ్మర్ మొత్తం ఒక్క హిట్ కూడా లేకుండా పరిశ్రమకు భారీగానే నష్టం మిగిల్చింది. ఇప్పుడు కల్కి సినిమాతో థియేటర్లు మళ్ళీ కళకళలాడాయి. ఈ ఇయర్ సెకండ్ హాఫ్‌లో అయినా ఎక్కువ హిట్లు టాలీవుడ్‌లో వస్తా యేమో చూడాలి.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733